సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



దరఖాస్తు చేసుకోవాలి

నేతన్న పొదుపు పథకానికి ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ఆర్‌డీడీ పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఖిలా చరిత్రను భావితరాలకు అందజేస్తాం



భువనగిరి ఖిలా సందర్శనకు వచ్చిన ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు

భువనగిరి : భారతీయ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణకు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ కృషి చేస్తోందని, అందులో భాగంగా భువనగిరి కోట విశేషాలపై అధ్యయనం చేసి భావితరాలకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. శనివారం భువనగిరి ఖిలాను సందర్శించి కోటపై కట్టడాలను పరిశీలించారు. చారిత్రక, వారసత్వ సంపద పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. వారికి కోట చరిత్రను గైడ్ ఆవుల వినోద్, పర్వతారోహకురాలు అన్విత వివరించారు. ఖిలాను సందర్శించిన వారిలో సభ్యులు హరీష్, దుర్గ, శశాంక్, కిరణ్ తదితరులు ఉన్నారు.

కోడ్ ముగిసే వరకు ప్రజావాణి రద్దు

భువనగిరి టౌన్ : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత తిరిగి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

సీపీఐని కలుపుకుపోతాం



సీపీఐ నాయకులతో సమావేశమైన ప్రభుత్వ విప్ ఐలయ్య, చిత్రంలో గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐతో సర్దుబాటు చేసుకుని, వారికి బలం ఉన్న చోట సీట్లు కేటాయిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. శనివారం యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, మండలాల కార్యదర్శులతో సమావేశం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏవిధంగా ముందుకెళ్లాలనే విషయమై త్వరలో మరోసారి సమావేశమై చర్చిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ రానుందని, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, మండల పార్టీ కార్యదర్శులు కల్లెపల్లి మహేందర్, చిగుళ్ల లింగం, మారుపాక వెంకటేష్, అన్నమైన వెంకటేష్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, జిల్లా సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, బంగారి తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా బాధ్యతల స్వీకరణ

చౌటుప్పల్ : చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి ఇంచార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.రాజగోపాల్ తిరిగి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వివిధ కారణాలతో ఆయనను డిసెంబర్ 30న సస్పెన్షన్‌కు గురయ్యారు. హైకోర్టును ఆశ్రయించగా సస్పెన్షన్‌ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది. అతన్ని పోస్టింగ్‌లో నియమించాలని వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్‌తోపాటు డీసీహెచ్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాజగోపాల్ శనివారం ఆస్పత్రికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు.

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

భువనగిరి : సికింద్రాబాద్– కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 10నుంచి 20వ తేదీ వరకు 11 రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు శనివారం ప్రకటించారు. కాజీపేట–ఖమ్మం– విజయవాడ మధ్య మూడో లైన్ పనుల కారణంగా రైలును రైద్దు చేసినట్లు తెలిపారు. భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగజ్‌నగర్ – సికింద్రాబాద్‌కు భువనగిరి మీదుగా రోజూ ఉదయం 8.44 గంటలకు, సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు సాయంత్రం 4.14 గంటలకు వెళ్తుంది. రైలును పునరుద్ధరించే వరకు భువనగిరితో పాటు జిల్లా ప్రజలు రవాణాపరంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

నృసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకుని శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో లక్ష పుష్పార్చన పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా నిర్వహించారు. ఆలయ ముఖమండపంలోని ఉత్సవమూర్తులను అలంకరించి తులసీదళాలు, వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజ నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన, సుదర్శన హోమం, నిత్యకల్యాణం తదితర సంప్రదాయ పూజలను నేత్రపర్వంగా చేపట్టారు.



ఉత్సవమూర్తులకు పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

మరణించినా.. జీవిస్తూ

అవయవదానం ద్వారా 21 మందికి పునర్జన్మ.. ఏడాదిలో ఎనిమిది బ్రెయిన్‌డెడ్ ఘటనలు

- అవయవదానంపై పెరుగుతున్న అవగాహన
- వైద్యులు, జీవన్‌దాన్ సభ్యుల సూచనతో ముందుకొస్తున్న కుటుంబాలు



మోత్కూరులో వరకాంతం నర్సిరెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఐపీఎస్ అధికారి సజ్జనార్ (ఫైల్)

సాక్షి, యాదాద్రి : అవయవ దానం చేయడం ద్వారా తాము చనిపోతూ మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. వివిధ కారణాలతో చావుకు దగ్గరైన వారి అవయవాలనదానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకువస్తున్నారు. డాక్టర్లు, జీవన్‌దాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా అవయవదానంపై అవగాహన పెరుగుతోంది. ఏడాదిలో ఎనిమిది బ్రెయిన్‌డెడ్ ఘటనలు చోటు చేసుకోగా మృతుల నుంచి సేకరించిన అవయవాల ద్వారా 21 మందికి పునర్మజన్మ కలిగింది.

అవయవ దాతలు

- ❖ భూదాన్‌పోచంపల్లి మండలం రాంలింగంపల్లి రేషన్‌డీలర్ చేపూరి లక్ష్మయ్యచారి(55) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దాంతో కుటుంబ సభ్యులు లక్ష్మయ్యచారి అవయవాలను జీవన్‌ధాన్‌కు దానం చేశారు. దీంతో ప్రాణాపాయంలో ఉన్న మరో నలుగురి ప్రాణాలు దక్కాయి.
- ❖ పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి చెందిన దేవరపల్లి మోహన్‌రెడ్డి(42) రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌తో మృతిచెందాడు. అతని అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఐదుగురికి ప్రాణాలు నిలిపారు.
- ❖ భువనగిరి మండలం మన్నెవారిపంపు గ్రామానికి చెందిన గుండ్ల ఎల్లారెడ్డి(68) శనివారం భువనగిరి పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. వైద్యుల సూచన మేరకు ఎల్లారెడ్డి కళ్లను హైదరాబాదులోని ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానకు అప్పగించారు.



- ❖ వలిగొండ మండలం కంచెనపల్లికి చెందిన మెరుగు అంజయ్య బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. వైద్యుల సూచన మేరకు అతని అవయవాలను దానం చేశారు.

ఆరుగురి జీవితాల్లో వెలుగులు

ఆలేరు మున్సిపాలిటీ బహదూర్‌పేటకు చెందిన జంపాల సుజాత(40) ఇంట్లో పనులు చేస్తుండగా అకస్మాత్తుగా కింద పడిపోయారు. వెంటనే ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూనే బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఆమె భర్త జంపాల దశరథ, కుటుంబసభ్యుల అంగీకారంతో జీవన్‌దాన్ బృందం ఆమె నుంచి కాలేయం, రెండు కిడ్నీలు, ఊపిరితిత్తుల, రెండు కంటి కార్నియాలు సేకరించి అవసరం ఉన్న వారికి అమర్చారు. అవయవదానంతో మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపడం ద్వారా బాధ నుంచి ఉపశమనం కలిగిందని దశరథ చెప్పారు.

అన్నదాత.. స్ఫూర్తిప్రదాత



మోత్కూరు మున్సిపాలిటీ పరిధి ఆరెగూడేనికి చెందిన వరకాంతం నర్సిరెడ్డి (45) బంక్‌లో పెట్రోలు పోయించుకుంటూ కుప్పకూలిపోయాడు. హైదరాబాద్ ఎల్బీనగర్ కామినేనికి తరలించగా.. నర్సిరెడ్డికి బ్రెయిన్‌డెడ్ అయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. డాక్టర్ల సలహామేరకు నర్సిరెడ్డి అవయవాలను దానం చేసేందుకు మృతుడి భార్య, కుటుంబీకులు సమ్మతించారు. జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో ఓ వ్యక్తికి గుండె మార్పిడి శస్త్రచికిత్స అత్యవసరం కావడంతో నర్సిరెడ్డి గుండెను అతనికి అమర్చేందుకు వైద్యులు నిర్ణయించారు. నర్సిరెడ్డి నుంచి గుండెను సేకరించి నాగోల్ మెట్రో రైలు ద్వారా జూబ్లీహిల్స్ అపోలోకు తరలించారు. గుండెతో పాటు మరికొన్ని అవయవాలు సేకరించారు. మతుడి భార్య నిర్మల, పదేళ్ల వయస్సున్న కుమారులు శశిధర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డిని ఐపీఎస్ అధికారి సజ్జనార్ పరామర్శించి అభినందించారు.



రాజాపేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఎమ్మ యాదగిరి(20) స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై రాజాపేట వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో యాదగిరి అపస్మారక స్థితికి వెళ్లాడు. హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లగా రెండు, మూడు రోజులు చికిత్స చేసిన తర్వాత బ్రెయిన్‌డెడ్ అయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. డాక్టర్ల సూచన మేరకు అవయవదానం చేశారు.

ఒక మరణం.. నలుగురికి ప్రాణదానం



చౌటప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లికి చెందిన బైరు అంజమ్మ(65) కింద పడిపోవడంతో బ్రెయిన్ డెడ్ అయ్యింది. వైద్యులు, జీవదాన్ ప్రతినిధుల సూచన మేరకు అవయవాలు ఇవ్వడానికి ఆమె కుమారులు సమ్మతించారు. అవయవదానం ద్వారా నలుగురి జీవితాల్లో వెలుగులు నిండాయి.

• బస్సుల కొరత.. ప్రయాణికుల వెత



చదువుకోవడానికి, వివిధ పనుల నిమిత్తం భువనగిరి వచ్చిన ప్రజలు, విద్యార్థులకు తిరుగు ప్రయాణంలో తిప్పలు తప్పడం లేదు. రోజూ సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. భువనగిరి నుంచి తిరుమలగిరి, మోత్కూరు, నల్లగొండ, హన్మకొండ, జనగాం, ఆలేరు వైపు సరిపడా బస్సులు లేకపోవడం.. చాలా బస్సులు నేరుగా బైపాస్ నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో ఈ పరిస్థితి దాపురించిందని ప్రయాణికులు వాపోతున్నారు. శనివారం సాయంత్రం బస్సుల రాకపోవడంతో ప్రయాణికులు రాత్రి పొద్దుపోయే వరకు బస్టాండ్‌లోనే పడిగాపులు కాసారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపాలని కోరుతున్నారు. - భువనగిరి టౌన్

యాసంగిలో భారీగా ధాన్యం దిగుబడి

- ఏడు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం
- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి : యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడి భారీగా పెరిగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. శనివారం తన చాంబర్‌లో సంబంధిత విభాగాల అధికారులతో సమావేశమైన యాసంగి ధాన్యం దిగుబడి, సేకరణ లక్ష్యం తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో సుమారు 2,75,000 ఎకరాల్లో వరి సాగు అయ్యిందని, 7 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. అందులో 4,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటినుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సీఎంఆర్ సరఫరాలో వేగం పెంచండి

యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సమయం దగ్గర పడుతుందని, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరాలో వేగం పెంచాలని మిల్లర్లకు సూచించారు. ఆ విధంగా అయితేనే మిల్లుల్లో ఖాళీ స్థలం ఏర్పడి ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం నిల్వ చేయడానికి అవసరం మేరకు స్థలాలను అద్దెకు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, సంబంధిత అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

ఆశ.. నిరాశేనా?

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మంత్రి పదవులు ఆశిస్తున్న ఆ ఇద్దరు ఎమ్మెల్యేల ఆశ ఇప్పట్లో నెరవేరేలా లేదు. మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో అవసరం లేదని అధిష్టానం తేల్చిచెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించడం నిరాశను మిగిల్చింది.

అధిష్టానం హామీ ఇచ్చిందని..

మంత్రి పదవుల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఉమ్మడి జిల్లా నుంచి మునుగోడు నియోజవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఉన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించే బాధ్యతను రాజగోపాల్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించారు. ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినట్లు అప్పట్లో చర్చ జరిగింది. మొత్తానికి భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలిచారు. అప్పటి నుంచి తనకు మంత్రి పదవి కచ్చితంగా వస్తుందని రాజగోపాల్‌రెడ్డి భావించినా ఇంతవరకు మంత్రివర్గ విస్తరణ మాత్రం జరగలేదు.

హోంమంత్రి పదవి ఇవ్వాలని..

మొదట్లో జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంత్రి పదవులు లభించాయి. ఆ తర్వాత మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చిన ప్రతిసారి రాజగోపాల్‌రెడ్డి పేరు ప్రస్తావనకు వస్తోంది. ఒకానొక సందర్భంలో తనకు హోం మంత్రి పదవి ఇవ్వాలని, తాను హోంమంత్రి అయితేనే కేసీఆర్‌ను సమర్థంగా ఎదుర్కొంటానని రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చారు.

లంబాడా కోటాలో వస్తుందని..

ఎస్టీ లంబాడా కోటాలో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌కు అవకాశం ఉంటుందనే చర్చ జోరుగా సాగింది. రాష్ట్రంలో ఆదివాసీ గిరిజన కోటాలో సీతక్కకు అధిష్టానం అవకాశం కల్పించింది. అయితే లంబాడా కోటాలో మరొక మంత్రి పదవి ఇస్తారన్న చర్చ సాగింది. ప్రస్తుతం కేబినెట్ విస్తరణ అవసరం లేదని అధిష్టానం స్పష్టం చేయడంతో ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి పదవి ఆశించిన ఇద్దరు ఎమ్మెల్యేలకు నిరాశ తప్పడం లేదు.

భారత మహిళా క్రికెట్ జట్టు అండర్-19 ప్రపంచ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ అమ్మాయి త్రిష గొంగిడిని ఆదర్శంగా తీసుకుని పలువురు అమ్మాయిలు క్రికెట్ సాధన చేస్తున్నారు. ఆటలపై ఆసక్తి ఉన్న కూతుళ్లను తల్లిదండ్రులు క్రికెట్ వైపు ప్రోత్సహించినప్పడే.. త్రిష, కమలిని, సనిక చాల్కే, వైష్ణవి శర్మ తరహాలో తయారవుతారు. ప్రస్తుతం సూర్యాపేట, కోదాడలోని క్రికెట్ అకాడమీల్లో శిక్షణ పొందుతున్న అమ్మాయిలు ఇప్పటికే పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అవకాశం వస్తే భారత జట్టుకు, మహిళల ఐపీఎల్‌కు ఎంపికై సత్తా చాటుతామని చెబుతున్నారు.

- సూర్యాపేట టౌన్, కోదాడరూరల్

త్రిషలా.. మేమూ ఆడతాం..



సూర్యాపేటలో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న అమ్మాయిలు

- మన వాళ్లలోనూ అండర్–19 మహిళల ప్రపంచకప్ గెలుపు స్ఫూర్తి
- క్రికెట్‌పై మక్కువతో కోచింగ్ తీసుకుంటున్న బాలికలు
- భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యమంటున్న అమ్మాయిలు

భారత జట్టుకు ఎంపికవుతా..

సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన అక్షయ 10వ తరగతి చదువుతోంది. క్రికెట్‌పై మక్కువతో సూర్యాపేటలోని ఎస్వీ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ ప్రతిభ చాటుతోంది. 2024లో భద్రాచలంలో అండర్–17 ఎస్‌జీఎఫ్ స్టేట్‌మీట్‌లో ఆడి సత్తా చాటింది. ఈ ఏడాది ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి స్టేట్ మీట్‌లో పాల్గొంది. ఈ ఏడాది జరగనున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) లీడ్ మ్యాచ్‌లో ఆడనున్నట్లు అక్షయ తెలిపింది. భారత జట్టుకు ఎంపిక కావడమే తన లక్ష్యమని అక్షయ పేర్కొంది.

ఆల్ రౌండర్‌గా రాణిస్తా..



సూర్యాపేటకు చెందిన క్రికెట్ కోచ్ వాంకుడోతు సుధాకర్, రేణుక దంపతుల కూతురు కారుణ్యశ్రీ 5వ తరగతి చదువుతోంది. కారుణ్యశ్రీ తన తండ్రి ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచే బ్యాట్ పట్టింది. ఈ ఏడాది ఖమ్మంలో జరిగిన అండర్–17 స్టేట్‌మీట్‌లో ఆడి ఆల్ రౌండర్‌గా ప్రతిభ కనబరిచింది. త్వరలో జరగనున్న హెచ్‌సీఏ లీగ్స్ ఆడటానికి వెళ్లనున్నట్లు కోచ్ సుధాకర్ తెలిపారు. భవిష్యత్‌లో భారత జట్టుకు ఎంపికై ఫాస్ట్ బౌలర్‌గా ఆడటమే తన లక్ష్యమని చెబుతోంది.

ఖేల్



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం



కోదాడ మండలం గుడిబండకు చెందిన లాస్యశ్రీ 9వ తరగతి చదువుతోంది. ఈ ఏడాది జనవరిలో ఖమ్మం నగరంలో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడల్లో పాల్గొంది. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించింది. క్రికెట్‌లో రాణించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు చెబుతోంది లాస్యశ్రీ.

చిచ్చర పిడుగు యోధ..

సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలునాయక్ కూతురు యోధ క్రికెట్‌లో రాణించేందుకు ప్రాక్టీస్ చేస్తోంది. యోధ ప్రస్తుతం 2వ తరగతి చదువుతోంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. త్వరలో లీగ్ మ్యాచ్‌లు ఆడటానికి సిద్ధంగా ఉన్నట్లు చెబుతోంది యోధ. నాన్న బాలునాయక్ ప్రోత్సాహంతో క్రికెట్ నేర్చుకుంటున్నానని..క్రికెటర్ శృతిమందన ఆడతానని చెబుతోంది.

దేశం తరఫున ఆడిన అరుంధతి



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మారుమూల గ్రామంలోనే జన్మించినప్పటికీ తనలో ఉన్న ప్రతిభతో జాతీయస్థాయిలో తనదైన ముద్రవేసుకుంది తిరుమలగిరి(సాగర్)కు చెందిన అరుంధతిరెడ్డి. మహిళల క్రికెట్‌లో రాణిస్తూ.. ప్రత్యేక గుర్తింపు సాధించుకుంది. 2018లో ఐసీసీ మహిళా ఛాంపియన్ షిప్ భారత్ -శ్రీలంక టీ–20లో ఆమె దేశం తరఫున అరంగేట్రం చేసింది. ఎడమచేతి వాటం బౌలింగ్ చేస్తూ అటు బ్యాటింగ్ లోనూ ప్రతిభ చూపి ఆల్ రౌండర్‌గా పేరు తెచ్చుకుంది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ తరఫున అండర్–16 జట్టుకు కెప్టెన్‌గా, అండర్ – 17, అండర్– 19, అండర్– 23 జట్లలో ఆడి మెరుగైన ప్రదర్శన కనబర్చింది. భారతీయ రైల్వేలో గ్రూప్–సీ ఉద్యోగిగా చేరి రైల్వే జట్టు తరుపున క్రికెట్ ఆడుతోంది. తండ్రి శాగం వెంకట్‌రెడ్డి కూడా రైల్వే ఉద్యోగి కావడం గమనార్హం.

డబ్ల్యూసీఎల్ జట్టుకు ఎంపిక



హుజూర్‌నగర్‌కు చెందిన పచ్చిపాల మహేశ్వరి డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. రోజూ కోదాడ వచ్చి కోచ్ సిద్దిఖ్ వద్ద క్రికెట్‌లో శిక్షణ పొందుతోంది. తండ్రి హుజూర్‌నగర్‌లో టీ స్టాల్ నడుపుతుండగా తల్లి గృహిణి. 2024 జూలైలో ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన ఉమెన్ క్రికెట్ లీగ్‌లో సెలక్షన్స్‌లో పాల్గొని అండర్–19 హైదరాబాద్ డబ్ల్యూసీఎల్ జట్టుకు ఎంపికైంది. క్రికెట్‌లో మరింత సాధన చేసి భారత జట్టు తరఫున ఆడి పుట్టిన నేలకు మంచి పేరు తెస్తానంటోంది మహేశ్వరి.

భువనగిరి కేంద్రమే ఆధారం!

- ఆధార్ సేవలకు ఏడాది నుంచి యాదగిరిగుట్ట ప్రజలు దూరం
- గతంలో ఉన్న కేంద్రం మూసివేత
- కొత్త కార్డులు, చేర్పులు, మార్పులకు అష్టకష్టాలు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏడాది కాలంగా ఈ పరిస్థితి దాపురించింది. గతంలో గుట్ట తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం నడిచేది. చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో మూసివేశారు. ఏడాది గడిచినా తిరిగి ప్రారంభించడం లేదు. దీంతో స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే..

ఆధార్ అవస్థలు అన్నీ ఇన్నీ కావు.. ప్రస్తుతం ఏ పనికావాలన్నా ఆధార్ ఉండాల్సిందే.. అది లేకపోతే పని జరగడం లేదు.. పోనీ ఆధార్ చేయించుకుందామంటే ఆ అవకాశమూ లేదు. ఎందుకంటే గుట్టలో ఉన్న ఒకే ఒక్క ఆధార్ కేంద్రం మూతపడింది. దీంతో ఆధార్ చేర్పులు, మార్పులకు అష్టకష్టాలు పడుతున్నారు. యాదగిరిగుట్ట మండలంలో 23 గ్రామాలు 75 వేల వరకు జనాభా ఉంది. ఏ ఒక్క గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయలేదు. కార్డుల్లో తప్పుల సవరణ, చేర్పులు, మార్పులు చేసుకోవడానికి భువనగిరికి వెళ్లాల్సి వస్తుంది. అంతదూరం వెళ్లినా సర్వర్‌లో సాంకేతిక సమస్యలు, రద్దీ తదితర కారణాలతో పొద్దస్తమానం ఎదురుచూడాల్సి వస్తుంది.



యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో మూతబడిన ఆధార్ నమోదు కేంద్రం

• దేవతలకు ఆహ్వానం



యాదగిరిగుట్ట శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దేవతాహ్వాన వేడుక నిర్వహిస్తున్న అర్చకులు - యాదగిరిగుట్ట

క్లుప్తంగా

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అనంతగిరి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం ఉదయం అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం మల్కాపురం వాగు నుంచి అదే గ్రామానికి చెందిన పచ్చిపాల నాగరాజు, బొమ్మన బోయిన సైదులు, నడికొప్పుల వీరబాబు, బాలాంత గణేష్, పోతుల శేఖర్ అనుమతులు లేకుండా మూడు ట్రాక్టర్లలో ఇసుకను తీసుకొస్తుండగా.. అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధి కోదాడ మండలం తమ్మర గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వాహనాల డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో విశేషపూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత కల్యాణంతు పూర్తి చేసి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజారోహణం.. దేవతాహ్వానం


గరుధ ఆళ్వారుడిని ఊరేగింపుగా ధ్వజ స్తంభం వద్దకు తీసుకెళ్తున్న అర్చకులు


భేరీ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

- రెండో రోజుకు చేరిన పూర్వగిరి బ్రహ్మోత్సవాలు
- నేటి నుంచి అలంకార సేవలు ప్రారంభం

యాదగిరిగుట్ట: పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. గరుధ ఆళ్వారుడిని కొత్త వస్త్రంపై చిత్రించి ఆలయ ముఖ మండపం, పుర వీధుల నుంచి ఊరేగింపుగా ధ్వజ పటాన్ని ధ్వజ స్తంభం వరకు తీసుకెళ్లారు. అక్కడ గరుధ ఆళ్వారుడికి ప్రత్యేక పూజలు జరిపించి, గరుధ ముద్దలను నైవేద్యంగా సమర్పించారు. అష్టరాగాల ఆలాపన చేసి, ధ్వజారోహణం నిర్వహించారు. గరుత్మంతుడికి సమర్పించిన నైవేద్యంను ఆచార్యులు భక్తులు, నిర్వాహకులకు అందజేశారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం వేదపారాయణీకులచే వేదపారాయణం, మూలమంత్ర, అనుష్టానముల గావించారు. అనంతరం భేరీపూజ, దేవతాహ్వానం నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, అర్చకులు, వేద పారాయణీకులు పాల్గొన్నారు.

నేడు అలంకార సేవ..
ఎదుర్కోలు మహోత్సవం

అలంకార సేవలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. నృసింహుడిని ఉదయం హవన పూజలు జరిపించిన తర్వాత సింహ వాహనంపై అలంకరించి తిరు వీధుల్లో సేవ నిర్వహిస్తారు. రాత్రి స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఎదుర్కోలు ఉత్సవంలో భాగంగా స్వామి వారు అశ్వవాహనంపై ఊరేగుతూ పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.


ఆళ్వారుడికి ఇష్టమైన గరుధ ముద్దలను ఆకాశంలోకి ఎగురవేస్తున్న ప్రధానార్చకుడు

క్రియాశీలక పౌర సమాజంతోనే సమ్మిళిత వృద్ధి

- ఎమ్మెల్సీ కోదండరాం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

రామగిరి(నల్లగొండ): క్రియాశీలక పౌర సమాజంతోనే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శనివారం ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ 9వ వార్షిక సమావేశానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన కృషిని వివరించారు. ప్రాంతీయ అభివృద్ధి రాజకీయ సమీకరణల ద్వారానే వేగవంతం అవుతుందని జయశంకర్ నినదించారన్నారు. తెలంగాణ ఉద్యమ ఫలాలు అణగారిన జాతులకు సమానంగా పంపిణీ జరగాలని ఆకాంక్షించారు. సమ్మిళిత వృద్ధి ద్వారా సామాజిక తెలంగాణే లక్ష్యంగా ముందుకు సాగాలని, అది క్రియాశీలక పౌర సమాజం ద్వారానే సాధ్యమని అన్నారు. సమాజాన్ని మరింత ప్రజాస్వామీకరించడమే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి అని అన్నారు. అనంతరం మరో ముఖ్యఅతిథి నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ మాజీ వీసీ జంధ్యాల బాలగంగాధర్ తిలక్ దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్య వృద్ధి అనే అంశంపై ప్రసంగించారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ ఆకాంక్షలను సాక్షాత్కరించే ఉన్నత విద్యపై నిర్లక్ష్యం తగదన్నారు. వికసిత్ భారత్ మరియు విశ్వగురు లక్ష్యాలుగా సాగడానికి ఉన్నత విద్యను సాధికార సాధనంగా గుర్తించి ముందుకు సాగాలన్నారు. దేశంలో ఉన్నత విద్య కొన్ని ప్రధాన నగరాలకు పరిమితమైందన్నారు. విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాలు సైతం ఉన్నత విద్యను మెరుగుపర్చడానికి నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో భూమి వినియోగం, పారిశ్రామిక అభివృద్ధి మరియు పర్యావరణ మార్పు, పునరుత్పాదక వనరులు అనే మూడు అంశాలపై పలువురు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఎంజీ యూనివర్సిటీ మొదటి రిజిస్ట్రార్, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య కట్ట ముత్యంరెడ్డి, సెక్రటరీ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, సెస్ డైరెక్టర్ రేవతి, చిట్టెడు కృష్ణారెడ్డి, కేవీ శశిధర్, పందరయ్య, సైదులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు

పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన ప్రైవేట్ బస్సు


బోల్తాపడిన బస్సు

వేములపల్లి: డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో ప్రైవేట్ బస్సు పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున వేములపల్లి గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చీరాల నుంచి చందు ప్రైవేట్ బస్సు శుక్రవారం రాత్రి 9.30గంటలకు 45 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. శనివారం తెల్లవారుజామున వేములపల్లి గ్రామ శివారులోని గంగమ్మగుట్ట సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులతో పాటు డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ డి. వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను క్షేమంగా వేరే బస్సుల్లో వారి వారి గమ్యస్థానాలకు చేర్చారు.

ఒంటరితనం భరించలేక యువకుడి ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

నాగార్జునసాగర్: ఒంటరితనం భరించలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్ కాలనీకి చెందిన బండ్ల సందీప్(30) తల్లిదండ్రులు అతడి చిన్నతనంలోనే మృతిచెందారు. సందీప్ ఒంటరిగా ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఒంటరితనం భరించలేక శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావ నరహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో.. ఒకరికి గాయాలు

- క్షతగాత్రుడిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: బైక్ వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన అబ్దుల్ రావూఫ్ నల్లగొండలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నల్లగొండలోనే ఉంటున్న రావూఫ్ శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో పని నిమిత్తం బైక్‌పై నకిరేకల్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారులో రావూఫ్ బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అబ్దుల్ రావూఫ్ తలకు తీవ్ర గాయమైంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రోడ్డుపై అపస్మారకస్థితిలో ఉన్న రావూఫ్‌ను తన వాహనంలో నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

కేతేపల్లి: కాలినడకన హైవే దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన వీరబోయిన అయిలమ్మ శనివారం ఉదయం స్థానిక జపమాల మాత చర్చి సమీపంలో విజయవాడ–హైదరాబాద్ హైవే దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అయిలమ్మ తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అయిలమ్మను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చెర్వుగట్టులో పూర్ణాహుతి


పూర్ణాహుతి నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున పూర్ణావతి, ఏకాంత సేవలను వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, అర్చక బృందం ఆధ్వర్యంలో మహా పూర్ణహుతి, హోమం, ధ్వజారోహణం, ఏకదశ రుద్రాభిషేకం, జ్యోతి లింగార్చన, ఏకాంతసేవ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయల ఈఓ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, వెంకటయ్య, నర్సిరెడ్డి, యాదయ్య, వంశీదర్‌రావు, రాజ్యలక్ష్మి, మహేందర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు


గాయపడిన గీత కార్మికుడు

నూతనకల్: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నూతనకల్ మండలం వెంకెపల్లిలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకెపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు తొనుకునూరి లక్ష్మయ్య కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కుతుండగా.. ప్రమాదశాత్తు జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని గ్రామస్తులు 108 వాహనంలో సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి కారు బోల్తా

- ఇద్దరికి గాయాలు

వలిగొండ : కారు అదుపుతప్పి మురుగుకాల్వను ఢీకొని బోల్తాపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం నరసాయగూడెం సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌కు చెందిన ఎస్‌కే కరీం, మిథులారెడ్డి, కందుల శ్రీనివాస్, మాధవ్, మధుసూదన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శనివారం ఐదుగురు కలిసి మోత్కూర్‌కు వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా.. వలిగొండ మండలం నరసాయగూడెం సమీపంలో కారు అదుపుతప్పి మురుగు కాల్వకు ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మాధవ్, మధుసూదన్ గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానికులు 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ.. ఏడుగురి రిమాండ్

మునగాల: మునగాల మండలం కలకోవ గ్రామంలో ఈ నెల 4వ తేదీ రాత్రి రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ఏడుగురిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలకోవ గ్రామానికి చెందిన కాసాని వెంకన్న, కాసాని ముత్తయ్య, కాసాని బలరామ్‌పై మరో వర్గానికి చెందిన పనస విజయ్‌కుమార్, దొడ్డా రపు వెంకటేష్, మునగలేటి చంద్రశేఖర్, చిర్రా ప్రదీప్ దాడి చేశారని బలరామ్ భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. శనివారం విజయ్‌కుమార్, వెంకటేష్, చంద్రశేఖర్, ప్రదీప్‌ను కోర్టులో హాజరుపర్చి జడ్జి ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ సబ్ జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా వెంకన్న, ముత్తయ్య, బలరామ్‌పై కూడా ఫిర్యాదు అందడంతో వారిని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం సూర్యాపేట సబ్ జైలుకు పంపినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య

చివ్వెంల(సూర్యాపేట): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని జి.తిరుమలగిరి గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జి.తిరుమలగిరి గ్రామానికి చెందిన మొగదాల సైదులు (54) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి పొలం వద్ద వెళ్లి అక్కడే కుప్పకూలిపోయాడు. ఇరుగు పొరుగు రైతులు గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

15లోపు 'నేతన్న పొదుపు'నకు దరఖాస్తు చేసుకోవాలి

- రాష్ట్ర చేనేత జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ


మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికులంతా ఈ నెల 15వ తేదీ లోపు నేతన్న పొదుపు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర చేనేత జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ అన్నారు. శనివారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని చేనేత డై హౌజ్‌లో నేతన్న పొదుపు పథకంపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పథకంలో భాగంగా నేతన్న పొదుపు పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. జియో ట్యాగింగ్ మగ్గం కల్గి, చేనేత వృత్తి చేస్తున్న వారందరూ ఈ పథకానికి అర్హులని చెప్పారు. మగ్గం నేసే కార్మికుడు తన వేతనం నుంచి నెలకు రూ.1200, ఒక అనుబంధ కార్మికుడు రూ.600 ఆర్‌డీ–1 అకౌంట్‌లో కట్టుకొంటే, ప్రభుత్వం రెండింతలు ఆర్‌డీ–2 ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. ఈ పథకానికి రెండు సంవత్సరాలు కాలపరిమితి మాత్రమే ఉందని తెలిపారు. అర్హులైన కార్మికులు సరైన సమాచారంతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నబర్‌తో ఆర్‌డీ–1 ఖాతాను తెరవాలని అన్నారు. అనంతరం అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన తర్వాతే ఆర్‌డీ–2 అకౌంట్‌ను తెరుస్తారని పేర్కొన్నారు. అక్రమాలకు తావు లేకుండా నిజమైన చేనేత కార్మికుడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. కొత్త మగ్గాలకు కూడా జియో ట్యాగింగ్ నంబర్ ఇస్తామని, కాకపోతే వారు నిరంతరంగా పనిచేస్తూ ఉండాలని చెప్పారు. జిల్లాలో 7500 వరకు జియో ట్యాగింగ్ కల్గిన మగ్గాలున్నాయని, గతంలో 11వేల వరకు త్రిఫ్ట్ పథకంలో చేరారని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా కొత్తగా 2వేల పొదుపు పథకం దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఈ అవకాశాన్ని చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇద్దరు అనుబంధ కార్మికుల నుంచి ఒకరికి కుదించడం, ప్రతిసారి మగ్గాల పరిశీలన చేసిన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంతో కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి, డీఓ శ్రీనివాస్, ఏడీఏ బాలమోహన్‌రెడ్డి, మేనేజర్ అంజనేయులు, చేనేత సంఘాల నాయకులు భారత లవకుమార్, అంకం పాండు, మెరుగు శశికళ, చింతకింది రమేష్, కర్నాటి పురుషోత్తం, మంగళపల్లి శ్రీహరి, భారత భూషణ్, రాజేశ్వరీ, దుద్యాల బాలకృష్ణ, పెండెం కైలాసం తదితరులు పాల్గొన్నారు.

బత్తాయిలో మంగు.. నివారణ చర్యలు



గుర్రంపోడు: బత్తాయి రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో ఒకటి మంగు. దీని వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బత్తాయి కాయలపై వక్క లేదా ఊదా రంగు లేదా ముదురు గోధుమరంగు ఏర్పడటాన్ని మంగు అంటారు. కొన్నిరకాల మైట్స్ వల్ల కాయలపై తుప్పు మరకలు, గజ్జి మచ్చలు, గీతలు ఏర్పడతాయి. కాయలు పైకి కనిపించడగానికి నాణ్యతగా ఉండక మార్కెట్‌లో ధర బాగా పడిపోతుంది. ప్రస్తుతం కత్తెర బత్తాయి కాయలు మంచి సైజును సంతరించుకునే దశలో ఉన్నాయి. ముఖ్యంగా చలి వాతావరణం తగ్గి ఎండలు ప్రారంభమయ్యే ఫిబ్రవరి, మార్చి నెలల్లో మంగు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ దశలో బత్తాయిలో మంగును నివారించి విలువైన కత్తెర బత్తాయి పంటను కాపాడుకోవడంపై అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి అందిస్తున్న సూచనలు, సలహాలు ఇవీ..

నల్లి పురుగులతో మంగు

బత్తాయి కాయలపై మంగు ఏర్పడటానికి ప్రధాన కారణం మంగు నల్లి. ఈ నల్లులు కంటికి కనిపించనంత చిన్నవిగా ఉంటాయి. వీటిని భూతద్దంలో సులభంగా చూడవచ్చు. వీటి పిల్లలు పసుపురంగులోనూ, పెద్ద నల్లులు నారింజ రంగులోనూ ఉంటాయి. పిల్ల, పెద్ద మంగు నల్లులు పిందెలపైన, కాయలపైన పారాడుతూ బత్తాయి కాయల తొక్కల నుంచి రసం పీల్చుతాయి. రసాన్ని పీల్చే ప్రక్రియలో నల్లి నోటి నుంచి రసాయాన్ని వదులుతుంది. ఈ రసాయనం కాయ తోలు నుంచి స్రవించిన ద్రవం, సూర్యరశ్మి మార్పు చెంది తుప్పు రంగుగా మారుతుంది. అందుకే బయటకు కనిపించే, సూర్యరశ్మి తగిలే కాయల్లో మంగు బాగా కనిపిస్తుంది.


మంగు సోకిన బత్తాయి కాయలు

బత్తాయి పిందెలకు నల్లి ఆశిస్తే కాయ సైజు తగ్గదు కాని మంగు వచ్చి తోలు గట్టిపడి పెలుసుగా మారుతుంది. కాయ రుచిలో తేడా రాదు. ఐనా మంగు కాయలకు తోలు గట్టిపడి పెలుసుగా మారి చూడటానికి నల్లగా కనిపిస్తున్నందున మార్కెట్‌లో ధర పలకదు. వ్యాపారులు కూడా తోటల్లో కొద్దిగా మంగు ఉన్నా చాలా ఎక్కువగా మంగు ఉందంటూ తక్కువ రేటుకు తీసుకుంటారు.

వాతావరణంలో మార్పులతో మంగు నల్లి నివారణ

రైతులు భూతద్దం సహాయంతో నల్లి ఉనికిపై నిఘా ఉంచాలి. ఒకటి, రెండు నల్లులు తోటలో ఎక్కడైనా పిందెలు, కాయలపై కనిపించగానే స్ప్రేయింగ్ మొదలు పెట్టాలి. రైతులందరూ సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలి. చెట్లలో కొమ్మల కత్తిరింపులు సక్రమంగా సకాలంలో చేసి చెట్టు లోపల గాలి వెలుతురు బాగా ప్రసరించేటట్లు చూడాలి. తోటల్లో ఎండు పుల్ల కత్తిరించిన వెంటనే లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి. ఈ రాగి ధాతువు శిలీంద్రనాశిని కత్తిరించిన కొమ్మలకు రక్షణ ఇవ్వడమేగాక నల్లికి ప్రతికూలంగా ఉంటుంది. మంగు నల్లి నివారణకు మంగు నివారణ మందులను మార్చుతూ ప్రతి 15 లేదా 20 రోజులకోమారు ఏప్రిల్ నెలాఖరు వరకు పిచికారీ చేయాలి. ఆ తర్వాత నెలకోసారి ఉధృతిని బట్టి పిచికారీ చేయాలి. లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల ప్రొపర్‌గైట్ లేదా ఒక గ్రాము డైపెంథిరాన్ లేదా రెండు మిల్లీలీటర్ల ఇథియాన్ లేదా 5 మిల్లీలీటర్ల డైకోఫాల్ వంతున కలిపి మందు మార్చుతూ అవసరాన్ని పిందెలన్నీ తడిసేలా పిచికారీ చేయాలి. పిందెలు గోళికాయ సైజు నుంచి నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు లీటరు నీటికి 5 గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్ మరియు 5 గ్రాముల మల్టీకే ఒక మారు పిచికారీ చేస్తే నల్లిని అణిచివేయడంతో పాటు కాయసైజు నాణ్యత పెరగుతుంది. నీటి తడులు ఎక్కువ కాకుండా అవసరం మేరకు డ్రిప్ పద్ధతిలో అందించాలి. సిఫారసు మేరకు సమతుల సమగ్ర ఎరువులు సకాలంలో అందించాలి. మంగు సోకిన కాయలను తోటలో ఉంచరాదు. తోటలో అంతరకృషి బాగా చేసి పరిశుభ్రతను పాటించాలి.

నల్లి ఉనికి ఉధృతం

క్రమంగా చలి వాతావరణం నుంచి వేడి వాతావరణానికి మారుతున్న సమయం, వర్షాభావ పరిస్థితులు మంగు ఉధృతికి ఎక్కువగా దోహదం చేస్తాయి. వర్షానికి పురుగులు చెట్టు నుంచి జారి కిందపడి నశిస్తాయి. వర్షాలు తక్కువగా ఉంటే నల్లి పురుగులు చెట్లపైనే ఆవాసాన్ని ఏర్పరుచుకుని స్థిరంగా ఉంటాయి.